క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని చౌడేశ్వరి మాత ఆలయ వార్షికోత్సవ వేడుకలను కొటార్మూర్ దేవాంగ సంఘం సభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు అన్నదానం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాంగ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బోర్గాం(కె)లో కానూరి స్మారక సభ



మాక్లూర్: మండలంలోని బోర్గాం(కె) గ్రామంలో శ్రామిక నాయకుడు కానూరి వెంకటేశ్వర్ రావు స్మారక సభను పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు దేశెట్టి సాయిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. సభకు అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ దాసు హాజరై మాట్లాడారు. ముందుగా కానూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రామికుల విముక్తి కోసం చేసిన పోరాటాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణగౌడ్, శంకర్, నగేశ్, గంగాధర్, రాధ, సరోజన పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ నుంచి రక్షణ కల్పించాలి



నందిపేట్: మండలంలోని చింరాజ్‌పల్లి మాజీ సర్పంచ్ తోట గణేశ్ నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన పూర్ణచందర్ రావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని తన భూమిని కబ్జా చేయడానికి దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ గత నాలుగేళ్ల నుంచి దౌర్జాన్యాలకు దిగుతున్నాడని అన్నారు. తనకు తన కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరాడు.

ఆలయంలో పూజలు



ఎడపల్లి: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో హనుమాన్ దీక్షాపరులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో పిట్ల కృష్ణ మహరాజ్ హనుమాన్ పారాయణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు.

రేపు ఆలయ శిఖర ప్రతిష్ఠాపన

బోధన్: సాలూర మండల కేంద్రం శివారులోని ఒంటి హనుమాన్ ఆలయ శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 గంటలకు ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ ఇల్తెపు గంగయ్య శనివారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంద ప్రీ స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డేని ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం నలంద ప్రసాద్, నలంద సాగర్ విద్యార్థులకు పట్టాలను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు అరుంధతి, శ్రావణి, ఫాతిమా, అర్షియా, మమత, శృతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ. 30వేలు పరిహారం ఇవ్వాలి

వర్ని(మోస్రా): అకాల వర్షానికి నేలకొరిగిన పంటలను సీపీఎం నేతలు నన్నేసాబ్, మేకల మల్లేష్ రైతులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ.. పంట నష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ. 30 వేలు పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధిత రైతులకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో రైతులు నర్సయ్య, మోహన్, సిరాజుద్దీన్, సాయిలు, బోయిడి సాయిలు తదితరులు పాల్గొన్నారు.



మాక్లూర్ మండలం వల్లభాపూర్‌లో తడిసిన ధాన్యం



ముప్కాల్ మండలం రెంజర్లలో తడిసిన ధాన్యం



బాపునగర్ శివారులో తడిసిన ధాన్యం



రానాకలాన్ శివారులో నేలకొరిగిన వరి పంట

రైతన్నకు 'అకాల' నష్టం

- అకాల వర్షంతో చేతికొచ్చిన పంట నీటి పాలు
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు



సాలూరలో తడిసిన ధాన్యాన్ని మరో చోటుకు తరలిస్తున్న రైతులు

సాక్షి నెట్‌వర్క్: అకాల వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. వరి కోతలు చివరి దశలో ఉన్న పొలాల్లో వడ్లు రాలిపోగా.. కోసిన ధాన్యం నీటి పాలు కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల పంటలు నేలకొరిగాయి.

ఆలూర్ బైపాస్ రోడ్డులో రైతులు ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసింది. ఆర్మూర్ పట్టణంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన వర్షానికి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం వర్షపు నీరుతో నిండిపోయింది. ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్మూర్‌తో పాటు ఆలూర్ మండలాల్లో కురిసిన అకాల వర్షంతో ధాన్యం తడిసి పోయింది. ఎడపల్లి మండలంలోని బాపునగర్ శివారులో వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోగా, రాణా కలాన్ శివారులో వరిపంట నేలకొరిగింది. వర్ని, చందూర్, మోస్రా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. కురుస్తున్న వర్షాలకు కోసిన వరి పంటపై రైతులు టార్పాలిన్లు కప్పి జాగ్రత్త చర్యలు చేపట్టారు. రుద్రూర్, కోటగిరి, పొతంగల్ మండలాల్లో కురిసిన అకాల వర్షానికి పలు గ్రామాల్లో ధాన్యం తడిసింది. మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు పొతంగల్, కోటగిరిలో పర్యటించి పంటను పరిశీలించారు.

రెంజల్‌లో పలువురు రైతులు ధాన్యం కుప్పలపై ఉన్న వర్షపు నీటిని స్పంజిలతో తొలగించారు. మాక్లూర్ మండలంలోని అమ్రాద్, బోర్గాం(కె), బొంకన్‌పల్లి, వల్లభాపూర్, కొత్తపల్లి, ముల్లంగి(బి) గ్రామాల్లోని రైతులు తమ కల్లాలపై ధాన్యం ఉంచడంతో కురిసిన అకాల వర్షాలకు తడిసిపోయింది. డొంకేశ్వర్ మండలంలో రైతులు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసింది. దత్తాపూర్, తొండాకూర్, నికాల్‌పూర్, నూత్‌పల్లి, మారంపల్లి, కోమట్‌పల్లి, నడ్కుడ, గాదేపల్లి గ్రామాల్లో వడ్లు తడిసి ముద్దయ్యాయి. టార్పాలిన్లపై నిలిచిన వర్షపు నీటిని రైతులు తొలగించి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టారు. బాల్కొండ మండలంలో వడగండ్ల వర్షం పడడంతో రైతులు తడిసిన ధాన్యాన్ని తరలించడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెంజర్ల, పలు గ్రామాల్లో కోసిన ధాన్యం తడిసిపోయింది.

బోధన్ ప్రాంతంలో రెండు రోజులుగా ఉరుములు, మెరుపులతో కూడిన తేలిక పాటి వర్షం కురవడంతో ధాన్యం తడిసింది. బోధన్, సాలూర, ఎడపల్లి, రెంజల్, నవీపేట మండలాల్లో సుమారు 80 వేల ఎకరాల్లో వరి పంట సాగైంది. ఎడపల్లి, రెంజల్, బోధన్ మండలాల్లో 80 శాతం వరకు పంట కోతలు, నూర్పిళ్లు పూర్తి కాగా, నవీపేట, సాలూర మండలాల్లో 60 శాతం వరకు పూర్తయ్యాయి. బోధన్, సాలూర మండలంలో 251 మంది రైతులకు సంబంధించి సుమారు 481 ఎకరాల్లో కోత దశలో ఉన్న వరి నేలకొరిగి, గింజ రాలిపోయి అపార నష్టం వాటిల్లింది. జిల్లాలో సుమారు 3 వేల ఎకరాల్లో పొద్దుతిరుడు పంట సాగైంది. కాగా, బోధన్ డివిజన్‌లోనే సుమారు 1600 ఎకరాల్లో ఈ పంట సాగు కాగా 15 రోజుల క్రితం పంట నూర్పిళ్లు ప్రారంభమయ్యాయి. ఇంతలోనే అకాల వర్షం కురవడంతో పంటను కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుచోట్ల మండల వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



రెంజల్‌లో వర్షపు నీటిని తొలగిస్తున్న రైతు



రుద్రూర్ శివారులో తడిసిన ధాన్యం



దోమలెడ్గిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో



ఆలూర్ బైపాస్ రోడ్డులో తడిసిన ధాన్యం



దత్తాపూర్‌లో తడిసిన వడ్ల సంచులు



టార్పాలిన్లపై నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతు



నికాల్‌పూర్‌లో తడిసిన ధాన్యం



సాలూర మండలం హున్సాలో తడిసిన పొద్దుతిరుగుడు పంట



రెంజర్లలో ధాన్యంపై సంచులు కప్పిన రైతులు

అగ్ని ప్రమాదాలపై జాగ్రత్త వహించాలి



ఆర్మూర్‌లో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏసీపీ



బోధన్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో

ఆర్మూర్‌టౌన్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు భయందోళనకు గురికాకుండా జాగ్రత్తలు పాటిస్తే వాటిని నివారించవచ్చని ఏసీపీ బస్వారెడ్డి అన్నారు. పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన అగ్నిమాపక వారోత్సవాల గోడప్రతులను ఏసీపీ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు కొనసాగనున్నాయని అన్నారు. ఈ వారోత్సవాల్లో అధికారులు అగ్నిప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించనున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులకు లైటర్లు, పటాకుల వంటికి దూరంగా ఉంచాలన్నారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌వో మధుసూదన్‌రెడ్డి, ఎల్ఎఫ్ ప్రకాశ్, అనంతరావు, వంశీ పాల్గొన్నారు.

బోధన్‌లో..

బోధన్‌టౌన్: మండలంలోని ఆర్డీవో కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల వాల్ పోస్టర్లను ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ స్టేషన్ ఆఫీసర్ గంగదాస్, సిబ్బంది నర్సయ్య, వారిస్ అహ్మద్, అబ్దుల్ రషీద్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో వినయ్‌రెడ్డి



బస్సాపూర్ మాజీ సర్పంచ్‌కు కండువా వేస్తున్న సునీల్‌రెడ్డి

పెర్కిట్: ఆర్మూర్ మండలం చేపూర్‌కు చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి సమక్షంలో చేపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ జన్నెపల్లి గంగాధర్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌తో పాటు వార్డు సభ్యులు, నాయకులు పార్టీలో చేరారు. వీరికి వినయ్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు మార చంద్రమోహన్, ఆర్మూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విఠం జీవన్, అంకాపూర్ ఎంపీటీసీ ఎంసీ గంగారెడ్డి, నాయకులు కొంతం మురళి, లోక ముత్యం రెడ్డి, ఏలేగి రవికాంత్‌రెడ్డి, అమృత్ రావు, నర్సారెడ్డి, బట్టు నవీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బస్సాపూర్ మాజీ సర్పంచ్..

బాల్కొండ: మండలంలోని బస్సాపూర్ మాజీ సర్పంచ్ జాపు భూమన్న శనివారం తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ రెడ్డి కండువా వేసిక పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పోచంపాడ్ వాసులు..

మెండోరా మండలం పోచంపాడ్‌లోని అమ్రాయి కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేశ్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

నందిపేటలో..

నందిపేట్: మండలానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. వీరికి పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సీహెచ్ కొండూర్ లిఫ్ట్ చైర్మన్ ఓంకార్, మాజీ ఎంపీటీసీ రాందాస్, నాయకులు రాజశేఖర్, రాజేశ్వర్, మురళి, ప్రశాంత్, పబ్బిలు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, డీసీసీ ఉపాధ్యక్షుడు పెంట ఇంద్రుడు, పిప్పెర సాయరెడ్డి, సొసైటీ ఉపాధ్యక్షుడు ముత్యం తదితరులు పాల్గొన్నారు.



పోచంపాడ్ నాయకులతో సునీల్‌రెడ్డి



నందిపేట వాసులకు కండువా వేస్తున్న వినయ్‌రెడ్డి

బీజేపీతో బీడీ కార్మికులకు అన్యాయం



మాట్లాడుతున్న మల్లేశ్

వర్ని(మోస్రా): కేంద్రంలో ఉన్న బీజేపీతో బీడీ కార్మికులకు అన్యాయం జరుగుతోందని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ అన్నారు. మండలంలోని తిమ్మాపూర్‌లో బీడీ కార్మికులతో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీడీలపై 27 శాతం జీఎస్టీ విధించి పరిశ్రమను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. కేంద్ర వ్యవహరిస్తున్న తీరుపై బీడీ కార్మికులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించకుండా కార్మికుల పొట్ట కొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. బీడీ కార్మికులకు ఈపీఎఫ్ పెన్షన్ పెంచి కార్మికులకు రావాల్సిన పీఎఫ్ డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు. గంగామణి, సావిత్రి, బాలమణి, లావణ్య, లక్ష్మి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఈశ్వర్

రుద్రూర్: మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో బీఎస్పీ గ్రామ ఇన్‌చార్జి సాయికుమార్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, న్యాయవాది ఈశ్వర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. తన తండ్రి జలయ్య వర్ధంతి సందర్భంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇందూరు ఎంపీ స్థానం కాంగ్రెస్‌కే..

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

నవీపేట: పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీ స్థానం కాంగ్రెస్‌కే దక్కుతుందని పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని రఘుపతిరెడ్డి గార్డెన్‌లో శనివారం నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీజేపీ నుంచి ఎంపీగా గెలిచిన అర్వింద్ వంద రోజుల్లో పసుపుబోర్డు తెస్తానని చెప్పి, పత్తా లేకుండా పోయాడని ఎద్దేవా చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు స్వస్తి పలికిన రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుని కాంగ్రెస్‌కు అధికారం అప్పగించారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో దైవాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం సరైంది కాదని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమాన్ని విస్మరించిదన్నారు. ఎంపీపీ సంగెం శ్రీనివాస్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచులు, బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, మానాల మోహన్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, గంగాశంకర్, శ్రీనివాస్‌గౌడ్, సాయరెడ్డి, రాజేంద్ర కుమార్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, ప్రదీప్‌రావు, మూస గోపాల్, చల్ల రవీందర్, రాజు, సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారడం ద్రోహం చేయడమే..



సిరికొండ: బీఆర్ఎస్ పార్టీ గుర్తు మీద పోటీ చేసి జెడ్పీటీసీగా గెలిచి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ లో చేరడం ద్రోహం చేయడమేనని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నారపోయిన శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెడ్పీటీసీ మాన్‌సింగ్‌కు అప్పటి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేశారని తెలిపారు. ఆపత్కాలంలో పార్టీని వదిలి వెళ్లడం సరైన పద్ధతి కాదన్నారు. ఆయన జెడ్పీటీసీ పదవికి రాజీనామా చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ రాజన్న, నాయకులు రాజేందర్, సురేందర్, రఘువాస్, బాలరాజు, మహేందర్, గంగనర్సయ్య, రంజిత్, సాయిచరణ్, రాజు, సంతోష్, దేవిదాస్, గంగాధర్ ఉన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 -	మైదాన్ (హిందీ)- 10.00, 10.25, లవ్‌గురు (తెలుగు)-01.50 శ్రీరంగనీతులు -7.40 గాడ్జిల్లా ఎక్స్ కాంగ్(3డీ-తెలుగు)-5.00
స్క్రీన్-2 -	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.00, 4.25, 10.50 ది ఫ్యామిలీ స్టార్ -01.00, 7.25
స్క్రీన్-3 -	బడేమియా చోటే మియా (తెలుగు)- 11.50, 6.30, గీతాంజలి మళ్లీ వచ్చింది - 3.25, 10.05
స్క్రీన్-4 -	గీతాంజలి మళ్లీ వచ్చింది - 10.15 మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు)- 1.20, 10.35 లవ్‌గురు-04.15, 7.25

ముగిసిన ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట: మండల కేంద్రంలో ప్రజా విరాళలతో నూతనంగా నిర్మించిన రామాలయంలో శనివారం దేవతామూర్తుల విగ్రహాలను పునఃప్రతిష్ఠించారు. పురాతన ఆలయాన్ని కూల్చేసి నిర్మించిన ఆలయంలో మూడు రోజుల క్రితం ప్రతిష్ఠాపన ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని ఆలయ కమిటీ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, నాయకులు మానాల మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, గోపాల్, సంజీవ్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కరిపె మల్లేశ్ పాల్గొన్నారు.